ఈవారం కథ

రెండో ప్రయాణం

– మల్లంపల్లి సాంబశివరావు



ఏడమటి వాగు నుంచి ఇంటికొచ్చేసరికి సీతామాలక్ష్మికి ఒళ్లంతా పులిసిపోయినట్టయింది. వీపు మీద వున్న మూటను వాకిట్లోనే దించేసుకుంది. గంజి తపేళాను పక్కనే పెట్టి, ఆ మూట మీదే వెనక్కి వొడ్డిగిలింది. బాగా అలసిపోయిందేమో కాసేపు కళ్లు మూసుకుంది.

'ఎప్పుడొచ్చావే! ముసలమ్మ ఏదీ?' అన్న మాటలకు కళ్లు తెరిచి చూస్తే ఎదురుగా తిరపతమ్మ కనిపించింది. 'కూసేపయిందే వచ్చి! ముసలమ్మ ఎనకమాలొత్తంది. కమ్మోరి బట్టలిచ్చిరాటానికి పోయింది' అని చెప్పి మూట మీద నుంచి లేచి మామూలుగా కూర్చుంది.

'నీరసంగా వున్నట్టుండావేంటే?' అని సీతామాలక్ష్మి పక్కనే కూర్చుంటూ అడిగింది తిరపతమ్మ. 'నీరసం గాక ఏముంటదే అత్తా! ఇయ్యాల బండెడు బట్టలు పడ్డయ్! ఎంకట్రామయ్య గారింట్లో పెళ్లి జనం ఇంకా పోచావలా. పెసిరెంటు గారి పెళ్లామేమో ఎద్దులాగా దుప్పట్లన్నీ ఇయ్యాలే తగలేసింది. ఉతికీ ఉతికీ రెక్కలు ముక్కలై పోయినియ్. వాగులో నీళ్లు లేవు సచ్చి! ఏం జేత్తాం, ఆ సెలమల్లో నీళ్లు తోడుకుని అట్టాగే ఉతికాం' అని చెప్పింది. 'అదీగాక ఇయ్యాల మా లావు అగ్గేసింది' అంటూ సానుభూతిగా చూసింది తిరపతమ్మ.

దానికి సీతామాలక్ష్మి అవునన్నట్టుగా తలూపుతూ 'ఇంటికాడి నుంచి తీసికెల్లిన మంచినీళ్లు చాల్తా! ఆ సెలమల్లో మురికినీళ్లు ఎన్ని తాగినా దప్పిక తీరిద్దా సచ్చిద్దా?' అంటూ కాళ్లు గోక్కోవడం మొదలు పెట్టింది. 'కాళ్లూ చేతులూ ఒకటే దురద... పీతిగుడ్డలూ, ముట్టు గుడ్డలూ ఉతుక్కుంటూ ఏడాది పొడుగూతా నీళ్లల్లో నానిపోతంటే దురదలు రాకుండా ఎట్టుంటయిలే?' అని తనకు తానే చెప్పుకుంది ఆమె.

'ఏమో లేమ్మా పాడు సాకిరం! వున్న నాలుగిళ్లూ కోడలకి అప్పజెప్పాక నా పని తేలిగ్గా వుంది గానీ... మొన్నటి దాకా నేనూ నానా సావు సచ్చాగా!' అంది తిరపతమ్మ. ఆమె ఇప్పుడు పిల్లలని, మంచంలో పడిన భర్తను చూసుకుంటూ ఇంటిపట్టునే వుంటోంది. కోడలు బట్టలుతుకుతుంది. కొడుకు కూలీనాలీ పనులకెళతాడు.

'ఇంట్లో మా వోళ్లు ఎవరూ వున్నట్టు లేదే' అంటూ సీతామాలక్ష్మి సందేహంగా గుమ్మం వైపుకి చూసింది. 'ఎవురుండారే? మీ అయ్యేమో బీట్లోకి గొడ్డను తోలుకెల్లాడు. శివయ్యేమో పెళ్లాన్ని తీసుకుని మామిడి అంట్లకి నీళ్లు పొయడానికి పోయాడు. పిల్లముండ మా ఇంటికాడ పిల్లలతో ఆడుకుంటంది' అని మళ్లీ ఒక్క క్షణం తర్వాత తిరపతమ్మే అడిగింది 'నిన్న నువ్వూ మీ ఆడబిడ్డా పోట్లాడుకున్నారంట గదే.. గొడవెందుకొచ్చిందీ...' అని. 'పోట్లాట ఇయ్యాల కొత్తేముందీ! ఎందుకైనా వత్తది. అలిమి గాని చోట వున్నప్పుడు అందరికీ లోకువవుతాం' అంటూ సీతామాలక్ష్మి ఆ విషయాన్ని పొడిగించడానికి ఇష్టపడలేదు.

'అదట్ట చావబెట్టుగానీ..' అంటూ తిరపతమ్మ గొంతు తగ్గించింది. 'నీ కోసం మద్దినాల నుంచి సూత్తన్నానే.. ఉప్పుడికి రెండు మూడు తడవలు మీ ఇంటికొచ్చిపోయా' అంది. 'ఎందుకో' అన్నట్టుగా కనుబొమలు ముడేసి చూసింది సీతామాలక్ష్మి. తిరపతమ్మ ఈసారి గొంతును ఇంకాస్త తగ్గించింది. 'మద్దినాల మీ ఆయన నాగులు వొచ్చాడే... ఇన్నాళ్లకి బుద్ధొచ్చింది గాలికుక్కకి. నిన్ను తీసుకెల్లి సుబ్రంగా వుంటానంటన్నాడు' అని అసలు విషయాన్ని చెప్పింది.

'నాగులు' అనే పేరు వినపడగానే సీతామాలక్ష్మికి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఆమె కళ్లలో ఆశ్చర్యం.. కొన్ని క్షణాల తర్వాత అవి కన్నీటితో నిండిపోయాయి. కొన్ని సంవత్సరాలుగా గూడు కట్టుకున్న దుఃఖం ఇప్పుడు ఆమె కళ్లలో నుంచి పైకి ఉబుకుతోంది.

'ఊరుకోమ్మా, ఊరుకో! ఏం జేద్దాం. తలరాతలట్టా రాశాడు దేముడు. ఉప్పుడికైనా ఆడి కళ్లు తెరిపిచ్చాడు. ఆడు మంచోడైనా, స్నన్నాసోడైనా ఆడది మొగుడి దగ్గర వుండాల్సిందే. పుట్టింటో ఎంత కాలమని వుంటాం...' అంటూ తిరపతమ్మ తన చీర చెంగుతో సీతామాలక్ష్మి కళ్లను తుడవబోయింది. సీతామాలక్ష్మి చిన్నపిల్లలా ఆమె ఒడిలో వాలిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది.

★★★

'దీనికి రొండు శాకిలెట్లంట ఇయ్యమ్మా' మేనకోడలు బుజ్జిని చూపిస్తూ ఖాసింబీతో చెప్పింది సీతామాలక్ష్మి. పిల్లకి ఛాక్లెటిస్తూ 'ఏమక్కాయ్! మీ ఆయనొచ్చాక మా ఇంటికి రాటమే మానేశావ్‌గా' అంది ఖాసింబీ నిష్టూరంగా.

'ఆయన గారు తిరపతమ్మ ఇంట్లోనే లక్కలాగా అతుక్కుపోయాడు. ఒకటిరొండు రోజులంటే పర్వాలేదుగానీ పోయిన పొద్దుగూతా ఆల్లింట్లో తింటే ఏం బాగుంటదీ? అందుకని నేనే కాతంత అన్నం కూరా తీసుకెలతన్నా! ఆళ్లు వొద్దని అంటార్లే గానీ, అయినా ఆళ్లకైనా కష్టమే గదా! రొండు వారాల నుంచి పొగులంతా సాకిరం చేసి పొద్దుటపూటా మాపటేలా ఆయనకి అన్నాలు మోసుకెల్లడం సరిపోతంది నాకు' అంటూ సమాధానం చెప్పింది సీతామాలక్ష్మి.

'ఓహో! అత్తగారింటో పాదం పెట్టడానికి నామర్దాగా వుందన్నమాట. పౌరుషాలకేమీ తక్కువ లేదు' అంది ఖాసింబీ. వెళ్లడానికి కదులుతున్న సీతామాలక్ష్మిని 'ఎల్దువుగానిలే కూచోక్కా! మరదలూ ముసలమ్మా జూసుకుంటార్లే ఏమన్నా పనుంటే' అంటూ కూర్చోపెట్టింది. 'ఏం జూసుకుంటారా? ముసలాయనకి తట్టెడు కోపం. ముసలమ్మకేమో పుట్టెడు చెముడు. నేను లేపోతే కాలూచెయ్యీ ఆడదాయనకి. కోడలొక కొరకాసు. అమను ఏమీ అడగడు. ఆమ గూడా మొగుడు వరకే గానీ ముసలోళ్లను పట్టిచ్చుకోదు' అంటూ గోడకు ఆనుకుని కూర్చుండిపోయింది.

'మీ ఆయన లేడా?' అనడిగింది ఖాసింబీని. 'లేడక్కా! సరుకులు తేటానికి మైలారం బోయాడు. ఇందాకటి బస్సు దిగలా! మొదటాట చినిమాకి ఎల్తుంటాడు' అందామె. ఖాసింబీ వాళ్లు చిన్న చిల్లర కొట్టు నడుపుకుంటున్నారు. 'మీ ఆయన రోజూ మా కొట్లోనే సిగిరెట్లు కొనుక్కుపోతన్నాడు. కదిపిత్తే - నాల్రోజుల్లో మా ఊరెల్లిపోతన్నాం అని చెబుతున్నాడు. ఇంతకీ ఎప్పుడు పయాణం?' ఆసక్తిగా అడిగింది ఖాసింబీ. సీతామాలక్ష్మి ముఖం విచారంగా పెట్టింది. 'ఎల్లాలా వొద్దా అని ఆలోచిత్తన్నా! నాకేమీ అర్థం గాకుండా వుంది' అంది నిదానంగా. రెండు నిముషాలు మౌనంగావుంది. 'తలకాయ పగిలిపోతందనుకో ఆలోజించి, ఆలోజించి... ఇయ్యన్నీ ఎవరితోనన్నా మాట్టాడదామంటే ఎవరితో మాట్టాడాలో గూడా అర్థం గాటల్లా! నిన్న మా అక్క కొడుకొత్తే ఆడిని అడిగా ఎల్లాలా వొద్దా అని ..' అంటూ ఖాసింబీకేసి చూసింది సీతామాలక్ష్మి. 'ఏమన్నాడు?' అడిగింది ఖాసింబీ. 'ఆడేం జెపుతాడు చిన్న పిల్లోడు! నా కళ్లెమ్మట నీళ్లు జూసి .. నీకెట్టా మంచిదనిపిత్తే అట్టా చెయ్యిపిన్నామా అన్నాడు. నీతో మాట్టాడదామంటే ఉప్పుడికి కుదిరింది. నాకు నువ్వు దప్ప ఇంకెవురున్నారు సావాసం' అందామె దిగులుగా. ఇంతకాలమూ ఆ మనిషి కోసం చూసి ఇప్పుడు ఇట్టా మట్టాడతదేంటబ్బా- అని లోలోపల అనుకుంది ఖాసింబీ. నాగులు లేవదీసుకుపోయిన రెడ్డామె మళ్లీ ఇంటికి పోయి కాపురం చేసుకుంటుందనీ, అతడు బెజవాడలో ఆటో నడుపుతూ ఎవరికో కనిపించాడనీ, రిక్షా తొక్కుతూ ఇంకెవరికో కనిపించాడనీ, మాటల్ని బట్టి చూస్తే భార్య కోసం వచ్చేలాగా వున్నాడనీ... ఈ ఏడేళ్లలో ఎన్నో మాటలు వింది సీతామాలక్ష్మి. ఆ మాటలు విన్నప్పుడల్లా సీతామాలక్ష్మి ఎంతో ఆశతో నాగులు వస్తాడని ఎదురుచూడటం ఖాసింబీకి తెలుసు. ఆ సంగతే అడిగిందామె. 'మా ఆయన పెద్దగాలోడనీ, మళ్లీ మజ్జిలో వొదిలేత్తాడేమోననీ అనుమానం మా వోళ్లకి. అదీ నిజమేగా మరి' అంటూ నిట్టూర్చింది సీతామాలక్ష్మి. 'అది గాదక్కా! ఆయనంతట ఆయనే వొచ్చాడుగా. ఇప్పుడు గూడా ఎల్లకుండా ఇక్కడే చాకిరీ జేసుకుంటా మొగుడూ ముద్దులూ లేకుండా ఎల్లకాలమూ అట్టాగే వుండిపోతావా ఏంటీ? అప్పుడేమో మీ అన్నయ్య మళ్లీ పెళ్లి జేత్తానంటే వొద్దన్నావు. మా ఆయన గుణం గుడిసేటిదే గానీ బుద్ధి మంచిదే అంటా ఆయన కోసమేగా కాసుకుని వున్నావు' అంటూ గుర్తు చేసింది ఖాసింబీ.

సీతామాలక్ష్మికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. గతం కళ్ల ముందు తిరుగుతోంది. ఎంతో అందగాడైన నాగులు పెళ్లిచూపులకు వచ్చినప్పుడే - పదహారేళ్ల సీతామాలక్ష్మి గుండెల్లో దేవుడై కొలువుతీరాడు. ఆ దేవుడు రాముడైతే ఎటువంటి బాధలుండేవో గానీ, అతడు కృష్ణుడయ్యాడు. బయట అనేక మంది ఆడవాళ్లతో అతనికున్న సంబంధాల గురించి తెలిసి అడిగినప్పుడల్లా సీతామాలక్ష్మికి తన్నులే బహుమానంగా దక్కాయి. కొంతకాలానికి 'బయట ఎట్టా వుంటే నాకెందుకులే నాతో బాగానే వుంటన్నాడుగా' అని సర్దుకుని పోవడం మొదలుపెట్టింది. ఆ విధంగా అనుకున్నాక సీతామాలక్ష్మికి బాధ తగ్గిపోయింది. ఒక రోజున నాగులు ఆ ఊళ్లో ఒక రెడ్డామెని లేపుకుపోయాడన్న వార్త ఊరంతా గుప్పుమంది. వాళ్ల మగవాళ్లు కత్తులూ కటార్లూ తీసుకుని ఇంటిమీద పడి 'నరికేస్తాం నా కొడుకుని' అంటూ వీరంగం వేసి వెళ్లారు. సీతామాలక్ష్మి భయపడిపోయింది. ఆయన ఎప్పుడొస్తాడో తెలీదు, వస్తే ఆయనను వాళ్లంతా ఏమన్నా చేస్తారేమో అనే భయం - ఏం చేయాలో తెలీక, ఇంట్లో ఒక్కతే వుండలేక గుడివాడలో వున్న అన్నయ్య దగ్గరకి వెళ్లింది. కొన్ని రోజులు గడిచాక అమ్మకు బాగోలేదంటే అన్నయ్యతో పాటు పుట్టింటికి వచ్చింది చూసొద్దామని. ఆమెకి తగ్గేవరకూ బట్టలుతకడం, ఇంటిపనీ అంతా చూసుకుంది. అప్పటికి శివయ్యకి ఇంకా పెళ్లి కాలేదు. ఆ తర్వాత నాగులు రానూలేదు, ఆమె పుట్టింటి నుంచి బయటకు అడుగుపెట్టనూ లేదు.

'ఇంతకాలమూ ఈళ్లు నన్ను సుబ్రంగా జూసుకున్నారు గదా! మళ్లీ ఆ మానుభావుడు ఇదివరకట్లాగే ఏసాలేత్తే .. మళ్లీ ఇక్కడకే జేరాలి. అది ఇంకెంత చులకనగా వుంటదో అని భయమేస్తంది. అందుకే ఈళ్లకి ఇష్టం లేకుండా నేను పోలేను' అంది సీతామాలక్ష్మి. 'ఆళ్లేమన్నా ఊరికే జూత్తన్నారా! సాకిరం చేత్తన్నావు గదా! ఆ రెక్కల కట్టమేదో అక్కడే పడు. ఈ ముసలోళ్లు ఏటెల్లకాలమూ వుంటారా! ఆళ్లు పోయినాక నీ సంగతేమవుద్ది?' ఆలోచించమన్నట్టుగా చెప్పింది ఖాసింబీ. 'అదీ నిజమే' అంటూ తలాడించింది. ఒళ్లో వున్న బుజ్జి తల నిమురుతూ 'ఇదొకటి బాగా అలవాటైపోయింది. ఇది బుట్టినకాణ్నుంచీ ఇది నా పిల్లే అనుకుంటా వచ్చా. దీన్ని గూడా వొదిలి పోవాలంటే బాధగా వుంది' అన్న సీతామాలక్ష్మి మాటలకు 'దాన్ని గూడా తీసుకెల్లండి. ఎట్టాగూ పిల్లల్లేరుగా' అంది ఖాసింబీ నవ్వుతూ. పెళ్లయిన కొత్తల్లో సీతామాలక్ష్మికి ఒక మగపిల్లోడు పుట్టి చచ్చిపోయాడు. అది గుర్తుకొచ్చినప్పుడల్లా ఆమెకి మనసు భారమవుతుంది. వాడే వుంటే ఈ పాటికి ఇంత అయ్యేవాడనీ, అంత అయ్యేవాడనీ కాస్తంత ఎదిగిన పిల్లలను చూసినప్పుడల్లా అనుకుంటుంది. వాడు బతికి బట్ట కడితే మొగుడు దేశాలు పట్టిపోయేవాడు కాదనీ, ఒకవేళ పోయినా వాడిని పెట్టుకుని ఒక్కదాన్నే అయినా బతికేదాన్ననీ అనుకుంటూ వుంటుంది. ఆ లోటును తమ్ముడి కూతురుతో భర్తీ చేసుకుంటోంది ఇప్పుడు. 'అరె! ఇది నిద్రకొచ్చింది. ఇక ఎల్తానమ్మా' అంటూ లేచింది సీతామాలక్ష్మి. 'తిరపతమ్మతో మాట్టాడిచ్చు. ఎవల బాదలు ఆళ్లు పడతారు. నీ దారిన నువ్వెల్లక్కా! ఆయన కూడా ఎప్పుడూ అట్టాగే ఎందుకుంటాడులే' అంది ఖాసింబీ. 'అందరూ అనుకున్నంత సెడ్డోడు ఏమీ కాదులేగానీ, ఆ ఒక్క దాంట్లోనే సెడ్డోడు. మోజులన్నీ తీరిపోయినియ్ గాబట్టి ఇంక ఎడకీ పోడనే అనుకుంటన్నా' అంటూ నిద్రపోతున్న పిల్లను చంకకు వేసుకుని ఇంటివైపు నడిచింది సీతామాలక్ష్మి.

★★★

'ఇంతకీ ఏమంటాడు దొరగారు?' అల్లుడి గురించి అడిగాడు కోటయ్య. అప్పుడే అన్నం తిని నులకమంచం మీద కూర్చున్నాడు. ఆయన దగ్గరే కింద కూర్చుని వుంది తిరపతమ్మ. దూరంగా వున్న దీపం బుడ్డిని వసారాలోకి తీసుకొచ్చి పెట్టి, తిరపతమ్మ పక్కనే కూర్చుంది నరసమ్మ. అప్పటిదాకా చావట్లో గొడ్డూగోదకి మేతవేసి నీళ్లు పెట్టి వచ్చిన శివయ్య, తండ్రి పక్కనే మంచం మీద కూర్చున్నాడు. సీతామాలక్ష్మి వసారాలో వున్న చివరి గుంజకు ఆనుకుని కూర్చుంది.

'ఏమంటాడు? అయిందేదో అయిపోయింది. ఇక నుంచి సుబ్రంగా వుంటాను. మా ఊరెల్లిపోతాం - అని అంటన్నాడు' కోటయ్యకి చెప్పింది తిరపతమ్మ. 'ఒకటి గాదు రొండుగాదు, ఏడేళ్లయింది. నా పిల్లని ఆగమాగం చేశాడు. మేమేగానీ లేపోతే దాని బతుకేమవ్వాలీ? గాల్లంజెకొడుకు ఉప్పుడికైనా కుదురుగా వుంటాడని నమ్మకమేంటీ?' అంటున్న కోటయ్య కంఠంలో కోపం వినిపిస్తోంది. మళ్లీ కాసేపాగి కోటయ్యే మాట్లాడాడు. 'తలిదండ్రీ లేపోయినా దమ్మిడీ ఆత్తీ లేపోయినా రెక్కలకట్టం జేసుకుని ఆళ్లే బతుకుతారులే అని పిల్లనిత్తే ... అది సాకిరం చేసొచ్చి నీకు తినబెట్టాలి... నువ్వు దొరబాబులా తిరిగొత్తావు. అది చాలక మళ్లీ దాన్నే కొట్టడం... చివరికి దేన్నో తీసుకుని దేశాల మీదకి పోయావు.. బతికావో, సచ్చావో, వత్తావో, రావో ... ఏమీ తెలవదు. నాకులాగానే నా పిల్లలు గూడా పాతకాలమోళ్లు గాబట్టే అది మళ్లీ పెళ్లి జేత్తానన్నా ఒప్పుకోకుండా ఆడి కోసమే ఎదురుజూత్తా వుంది. ఇప్పుడు ఆడిని నమ్మడం ఎట్టా?' అన్నాడు కోటయ్య. ఆయన మాటల్లో కూతురు గురించి లోలోపల గూడు కట్టుకున్న ఆవేదన కనిపించింది. 'అయిపోయిందాన్ని గురించి ఎందుకులే నానా! జరగాల్సింది జూద్దాం. అక్క సాకిరం చేసుకుంటది. బావను ఏమైనా కూలీనాలీ చేసుకుంటా ఈడే వుండమందాం' అని శివయ్య తన ఆలోచన చెప్పాడు. 'అట్టాగైనా మంచిదే! కానీ ఆడు ఇక్కడ వుండిచావనంటన్నాడుగా!' అంది తిరపతమ్మ.

'అరరె... ఇన్నాల నుంచి ఎంత పరువుగా బతుకుతున్నాం. పదెకరాల పొలం.. ఎడ్డూబండీ.. . మా అయ్యంటే, మా కుటంబమంటే ఊళ్లో కమ్మోరు గూడా ఎంత గవురవంగా జూత్తారు. ఇట్టాంటి తాడు దెగిన నాయాళ్లకి పిల్లల్నిచ్చాక పరువూ పోతంది. పిల్లల బతుకూ జెడతంది' అన్నాడు కోటయ్య.

ఆయన మాటల్లో బాధను చూసి తిరపతమ్మకి కూడా బాధ కలిగింది. 'ఏం జేద్దామన్నయ్యా! మంచి కూట్లో మంచి కూర దొరకదని శాత్రం వుండనే వుంది గదా! నీకేమో పని తప్ప లోకం తెలీకపాయే! ఏదో ఆడపిల్లల్ని ఒడ్డెక్కిచ్చాననుకున్నావు. తీరా జూత్తే ఆళ్లంతా నీళ్లలోనే వుండారు. ఈడు సొంతం కొన్నాళ్లు వదిలేసి పోయాడనే గానీ, మిగతావోళ్లు మాత్రం ఏమంత సుకంగా వుండారో చెప్పు? ఒకడేమో తాగుబోతు.. ఇంకొకడేమో తిరుగుబోతు.. అయ్యన్నీ తల్చుకుని బాధపడటం దేనికి! ఆళ్ల రాతలు అట్టా వుండయ్యని సరిపెట్టుకోడమే!'

కోటయ్య నలుగురు కూతుళ్లూ సాకిరం చేయడం, పొలం పనులకెళ్లడం తిరపతమ్మకి తెలీనిది ఏమీ కాదు. కోటయ్య కుటుంబం, ఆయన పిల్లలూ ఎంత పద్ధతిగా పెరిగిందీ కూడా తిరపతమ్మకు బాగానే తెలుసు. 'సరే న పిల్ల ఎక్కడున్నా కట్టం జేయాల్సిందే! అయినా మే ఎల్లకాలమూ బతికి వుంటామా? ఇదంతా ఎందుగ్గానీ. ఆమకి ఎట్టా అనిపిత్తే అట్టా జేయమను. ఆడు కుదురుగా వుంటే అదే కిందామీదా పడి ఎట్టాగొట్ట కాపరాన్ని నడిపిచ్చుకుంటది' అని భుజం మీద కండువా వేసుకుని బయటకి వెళ్లాడు.

అప్పటిదాకా వాళ్లంతా ఏం మాట్లాడుకుంటున్నారో వినపడకపోయినా ముఖకవళికలను బట్టి ఏ మాట్లాడుకున్నారో అర్థం చేసుకుంది నరసమ్మ. 'నీ దారి నువ్వెల్లమ్మా! అన్నింటికీ ఆ బగమంతుడే వుండాడు' అందామె కళ్లలో నీళ్లు నింపుకుంటూ. ఆ రాత్రి సీతామాలక్ష్మి ప్రాణం తేలికపడింది.

★★★

నాగులు, తిరపతమ్మ ఇంటి వసారాలో వాల్చి వున్న నులకమంచం మీద కూర్చుని వున్నాడు. బాగా చీకటి పడిపోయింది. 'ఇదింకా రాలేదేంటబ్బా' అనుకుంటూ భార్యకోసం ఎదురుచూస్తున్నాడు. పక్కనే వున్న చార్మినార్ సిగరెట్ పెట్టెలో నుంచి ఒక సిగరెట్ తీసి వెలిగించాడు. తిరపతమ్మ లోపల మంచంలో వున్న ముసలాయనకి అన్నం పెడుతోంది. ఆమె కోడలు పిల్లలకు అన్నాలు పెట్టి వాళ్లని నిద్రపుచ్చే ప్రయత్నం చేస్తోంది.

అప్పుడే ఒక గిన్నెలో కూరా, ఒక గిన్నెలో పెరుగు తీసుకుని తిరపతమ్మ ఇంటికి వచ్చింది సీతామాలక్ష్మి. దారిలో కాలికి పేడ అంటుకున్నట్టుగా వుంటే కాళ్లు కడుక్కుందామని నీళ్లతొట్టి దగ్గరకి వెళ్లింది. 'ఏం కూర తెచ్చావే' అంటూ నాగులు పలకరించాడు ఆమె వైపు చూస్తూ.

ఇంతలో దడి అవతల చీకట్లో ఒక మగ ఆకారం సైగ చేస్తున్నట్టుగా కనిపించింది నాగులుకి. ఆ దడి అవతల అన్నీ పొలాలే. వెంటనే కర్ర అందుకుని 'నా కొడకా నిలబడరా!' అంటూ దడి అవతలకి దూకాడు. 'ఎవరెవరు.. ఏం జరిగింది' అంటూ తిరపతమ్మ, ఆమె కోడలు బయటి

(మిగతా 13వ పేజీలో)

107

ప్రపంచ వ్యాప్తంగా సరస్వతి ఆకును వివిధ రకాల వ్యాధులకు శక్తినిచ్చే టానిక్ గా వాడ్తున్నారు. చైనా, మలేషియా, ఫిలిఫ్పైన్స్ తదితర దేశాలలో దీన్ని విరివిగా వాడుతున్నారు.

బృహస్పతి వంటి బుద్ధినిచ్చే

'సరస్వతి' లేక 'వల్లారి'

మందుమొక్క

సరస్వతి, వల్లారి, బ్రాహ్మి, మండూకపర్ని, బబస్నా మొదలగు నామాలతో పిలిచే మొక్క ఇది. కలుపు మొక్కగా, నీరు నిల్వవున్న ప్రదేశాలలో పెరుగుతుంది. పత్రాలు మూత్ర పిండాకారంలో వుండి కణుపుల వద్ద పెరుగుతాయి. కణుపు క్రింద భాగంలో వేర్లు ఏర్పడతాయి. కాండం తుంచి, వేర్లు వుండేట్లుగా చూచుకొని ఈ మొక్కలను నాటవచ్చు. నీడ, నీరు వుంటే బాగా పెరుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా సరస్వతి ఆకును వివిధ రకాల వ్యాధులు తగ్గించి, శక్తినిచ్చే టానిక్ గా వాడ్తున్నారు. చైనా, మలేషియా, ఫిలిఫ్పైన్స్ తదితర దేశాలలో దీన్ని విరివిగా వాడుతున్నారు.

దీన్ని శాస్త్రీయంగా 'సెంటిల్లా ఏషియాటికా' అని పిలుస్తారు, ఇది ఏపియేసి అనే కుటుంబానికి చెందిన మొక్క. అంటే మన పోపు గింజల మొక్కలతో సమానమయిన గుణాలున్న మొక్కగా పరిగణించవచ్చు. మొక్కలో 'ఆసియాటికో సైడ్' అనే ఔషధోపయుక్తమైన పదార్థం వుంది. వుంటే ఏమిటి? అని మీరడగవచ్చు. శాస్త్రజ్ఞులు దీని ఉపయోగం తెలుసుకున్నారు కనుకనే, మళ్ళీ మీ ముందుకు 'సరస్వతి' రెండవసారి వచ్చింది. 'ఆసియాటికో సైడ్' అనే పదార్థం మన దేహం లోని, 'రెటికులో ఎండోథీలియల్' విభాగాన్ని ఉత్తేజపరచగల శక్తి కలిగి వుంది. దీన్ని ఉత్తేజ పరిచినందు వలన మన దేహానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇక్కడే కొత్త రక్తకణాలు ఉత్పత్తి అయి, పాతవి నాశనమవుతాయి. కొవ్వులు నిల్వ చేయబడుతాయి. రక్త కణాల ఉత్పత్తికి కావలసిన ఐరన్ ఉత్పత్తి అవుతుంది. నిరోధకత జరగడం లేక మొదలవడం ఈ కణజాలం లోనే జరుగుతుంది.

ఇంకా అర్థమయ్యేట్లు చెప్పాలంటే, ఎక్కడయితే కణజాల బంధనం జరుగుతుందో అక్కడ 'సెంటెల్లా' తన ప్రభావాన్ని చూపి, అభివృద్ధికి దోహద పడుతుంది. ఈ రకమైన ప్రక్రియ, చికిత్స జరగడానికి ముఖ్యమైన నాంది. అంటే - పుండ్లు, గడ్డలు వచ్చిన ప్రదేశంలో కొత్త కణాలు ఏర్పడి కొత్త చర్మం త్వరగా రావాలంటే, 'కెరొటినైజేషన్' ఎక్కువగా జరగాలి. ఈ కెరొటినైజేషన్ ఎక్కువ చేసే శక్తి సరస్వతి ఆకుకు వుంది అని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

ఆరోగ్యవంతమైన చర్మానికి కావలసిన మాంసకృత్తులను, లిపిడ్‌లను, ప్రోటీన్‌ల ఉత్పత్తిని ఉత్తేజపరిచి, సామర్థ్యాన్ని పెంచే శక్తి, సరస్వతి ఆకులోని 'ఆసియాటికో సైడ్' కు వున్నది. రక్త నాళాల మధ్య వున్న సంధాన పరిచే కణజాలాన్ని సమర్థంగా పని చేయించి ధమనులకు శక్తిని, గట్టితనాన్ని ఇచ్చే శక్తి కూడా సరస్వతి ఆకుకు వున్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి.

పై పరిశోధనల వలన తేలిందేమంటే సరస్వతి ఆకు, కణజాలాల మీద ఎక్కువ ప్రభావం చూపి, అంటే చర్మం, దాన్ని అనుసంధానించే కణజాలం, లింఫ్ కణజాలం, రక్తనాళాలు, మ్యూకస్ పొర మొదలగు వాటికి కలిగే వ్యాధులను త్వరగా మాన్పే శక్తి చేకూరుస్తుందని తెలుస్తోంది.. రక్త ప్రసరణ సరిగా లేనప్పుడు నొప్పులు, వాపులు, ఇన్‌ఫెక్షన్ వున్నప్పుడు, శస్త్ర చికిత్స తరువాత త్వరగా కోలుకోవాలంటే సరస్వతి మంచి ప్రభావం చూపుతుందని తెలుస్తోంది.

సరస్వతి ఆకు కడుపులోకి తీసుకోవాలంటే రోజుకు 1/2 గ్రా - 1 గ్రా రోజుకు సరిపోతుంది.. పై పూతగా అయితే రోజుకు రెండు లేక మూడుసార్లు వాడాలి. ఈ మొక్క వాడకం వలన దుష్ఫలితాలు కనబడినట్లు ఇంతవరకు తెలియలేదు. అందువల్లనే, చైనా, మలేషియా దేశాలలో హెర్బల్ .యంటి సెప్టిక్, రీజువినేటింగ్ ఆయింట్‌మెంట్‌గా సరస్వతి చాలా ప్రసిద్ధిలో వుంది.

ఆయుర్వేదంలో దీనికి చేదు గుణముండి, నరాలకు, గుండెకు శక్తి నిచ్చే టానిక్‌గా గుర్తింపు పొందింది.. అనుభవ వైద్యంలో సరస్వతి ఆకు, మిరియాలు, తులసి కలిపి కాచిన కషాయం జలుబుతో కూడిన జ్వరం తగ్గిస్తుందని పేర్కొన్నారు.

మొక్క సమూలం కషాయం కాచి, పడుకునే ముందు ఒక అర్థ గ్లాసు చొప్పున నలభై రోజులు తీసుకుంటే మెదడుకు శక్తి కలిగి జ్ఞాపక శక్తి పెరుగుతుంది..శాస్త్రజ్ఞుల పరిశోధనలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి.

పత్రాలు నూరి, పసుపు, చిటికెడు కర్పూరం కలిపి శరీరానికి పట్టించి నాలుగు గంటల తర్వాత స్నానం చేస్తే, గజ్జి, కుష్ఠు, పుండ్లు మొదలగునవి తగ్గుతాయి.

- యస్. వేదవతి.

బొప్పాయి

ఫలశాస్త్రం



అందరికీ అందుబాటులో ఉన్న పండు బొప్పాయి పండు. బొప్పాయిలో అనేక రకాలున్నాయి. కాని వీటి అన్నింటి ఔషధ గుణాలు సుమారుగా ఒక్కటే. బాగా పండిన పండు చాలా తియ్యగా బాగుంటుంది.

అతిసారంతో చాలాకాలంగా బాధపడుతున్న వారికి ఈ బొప్పాయి పండు చాలా మంచి మందు. బొప్పాయి కాయను పైతొక్కు తీసి తెలకపిండి వేసి కూర వండుకొని తింటే మలబద్ధకం పోతుంది. వంటికి పట్టిన నీరుపోతుంది. బాలింతలకు పాలు బాగా పడతాయి.

గజ్జి, తామర మొదలైన చర్మ రోగాలున్నవారు రోజూ పచ్చి బొప్పాయి కాయ ముక్కల్ని రుద్దుకొన్నా, బొప్పాయి పాలను కొబ్బరి నూనెలో కలిపి పూసుకొన్నా ఆ చర్మ రోగాలు నయమౌతాయి. బొప్పాయి పాలలో కొబ్బరి నూనె కలపకుండా పూసుకుంటే చర్మం బొబ్బలెక్కుతుంది.

మలబద్ధకం, రక్త మొలలు, అజీర్ణం ఉన్నవారు రోజూ బొప్పాయి పండు ముక్కల్నితింటే ఎంతో మేలు కలుగుతుంది. బొప్పాయి కాయను తొక్కతో చితక్కొట్టి, రసం తీసి, తేలు కుట్టిన చోట రాస్తే బాధ తగ్గుతుంది. ఈ రసం అర ఔన్సును అర ఔన్సు తేనెతోకలిపి తాగితే కడుపులోని ఏలిక పాములు, మలి పురుగులు పోతాయి. ప్లీహ వాపు తగ్గుతుంది.

పచ్చికాయకు పొడుగునా గంట్లు పెడితే పాలు కారతాయి. ఆ పాలను సేకరించి ఎండలో పెడితే తెల్లని పొడి లభిస్తుంది. ఈ పొడిని ఒక గ్రాము చొప్పున పాలలో వేసుకొని భోజనం అయిన తర్వాత రెండు పూటలా తాగితే దీర్ఘకాలంగా ఉన్న అజీర్తి పోతుంది. పేగులకి కలిగే బాధలు పోతాయి. ఈ పొడిని తేనెలో కలిపి నోటిలో వేసుకొని చప్పరిస్తే నోటి పూత పోతుంది. రోజూ ఈ లేపనాన్ని రాసుకుంటే పులిపిరి కాయలు పోతాయి. చర్మ రోగాలు నయమౌతాయి.

ఈ బొప్పాయి ఆకుల్ని మెత్తగా నూరి, అందులో పసుపు కలిపి బోద కాలుకు పట్టువేస్తే వాపు తగ్గుతుంది. బొప్పాయి పండులోని గింజల్ని ఎండబెట్టి, పొడి చేసి, తేనెతో కలిపి తింటే కడుపులోని పురుగులు పోతాయి.

కలబందను బొప్పాయి పాలతో నూరి కుంకుడు గింజలంత మాత్రలను తయారుచేసి రెండుపూటలా ఒక్కొక్క మాత్ర వేసుకొంటే ఋతుస్రావమౌతుంది, గర్భ విచ్ఛిత్తి కలుగుతుంది.

-జి. వి. రామమూర్తి

ఇలా చేస్తే సరి

- ★ విశ్వరూప చెట్టు ఆకురసం ముఖానికి రాసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి.
- ★ వేపాకులను, ఉల్లిపాయలను కలిపి ముద్దగా నూరి ఒంటికి పూసుకొని కాసేపయ్యాక స్నానం చేస్తే చర్మ వ్యాధులు తగ్గిపోతాయి.
- ★ మారేడు గుజ్జు లేపనం చేస్తే జుత్తు రాలిపోవడం ఆగిపోతుంది.
- ★ గసగసాలను నీళ్ళతో మెత్తగా నూరి తలకు పట్టిస్తూ వుంటే కురులు ఆరోగ్యంగా పెరుగుతాయి.
- ★ పెరుగులో కాస్త మిరియాల పొడి కలిపి సేవిస్తే జలుబు తగ్గిపోతుంది.
- ★ దూదిని ఐస్ వాటర్‌లో ముంచి కళ్ళ మీద కాసేపు ఉంచుకుంటే కళ్ళ ఎరుపు తగ్గిపోతుంది.
- ★ పాలలో నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా తయారవుతుంది.
- ★ క్యాబేజీ రసం రాస్తే కళ్ళ చుట్టూ వున్న నల్లటి వలయాలు తగ్గిపోతాయి.
- ★ కీళ్ళ నొప్పులకు జిల్లేడు పాల పట్టు వేస్తే కీళ్ళ నొప్పులు తగ్గిపోతాయి.
- ★ శొంఠి, బెల్లం కలిపి నశ్యంగా ఉపయోగిస్తే వెక్కిళ్ళు తగ్గిపోతాయి.

-యస్. శివానంద్

(12వ పేజీ తరువాయి)

వచ్చారు. అప్పుడే కూలికి వెళ్లిన తిరపతమ్మ కొడుకు వెంకటేసు కూడా ఇంటికి చేరుకున్నాడు. 'తప్పించుకున్నాడు నా కొడుకు. దొరికితే పేగులు దీసి మెళ్లో ఏసుకునేవోడిని.' అనుకుంటూ నాగులు ఆయాసంతో రొప్పుతూ వెనక్కివచ్చాడు కొద్దిసేపటికి.

'ఎవుడే ఆడు? నీ కోసమేనా?' అంటూ సీతామాలక్ష్మి వైపు కోపంగా చూస్తూ పళ్లు బిగించాడు. కళ్లు ఎర్రబడ్డాయి. ఏమీ అర్థంకాని సీతామాలక్ష్మి 'అయ్యో రామా! ఇదేంటత్తా' అంటూ తిరపతమ్మకేసి ఆందోళనగా చూసింది. కళ్లలో నీళ్లు తిరిగాయి.

'ఏడుపులాపి.. సంగతేంటో చెప్పు' అంటూ ఆమె మీదకి వెళ్లబోతున్న నాగులును తిరపతమ్మ అడ్డుకుంది. 'ఏంట్రా చెప్పేది నీకు. అది అట్టాంటిదే అయ్యుంటే ఏడెనిమిదేళ్లు నీ కోసమే చూత్తా అట్టా వుండిపోయేది గాదురా. ఆళ్ల పెద్దన్న పెళ్లి చేత్తానంటే, ఎప్పటికైనా నా మొగుడు తిరిగొత్తాడు. ఆడి మీద నాకు నమ్మకముందీ అనుకుంటా అట్టాగే వుంది. నువ్వొదిలిపెట్టి పోయినప్పుడు దానికినిండా పాతికేళ్లు గూడా లేవు. సంతోసంగా వుండాల్సిన వొయిసులో మొగుడుండి కూడా ముండమోపిలా గా బతికిందిరా అది. దేశాలన్నీ తిరిగొచ్చినా, లంజలతో లమ్మిడీలతో కులికొచ్చినా, నిన్ను చెప్పు తీసుకుని కొట్టకుండా వుంది చూడు.. నువ్వొచ్చినందుకు సంతోసంతో తిరుగుతుంది చూడు... అందుకు దాన్ని చెప్పుచ్చుకుని కొట్టాలిరా.. తప్పు నీది గాదు దానిదే' అందామె ఆవేశంగా.

ఈలోగా వెంకటేసు వచ్చి నాగులును పక్కకు తీసుకెళ్లాడు. 'ఈ పక్కింట్లో ఒక పిల్ల వుందన్నా! దానికోసం ఒక కమ్మోరబ్బాయి తిరుగుతున్నాడు. అది ఆళ్ల ఇంట్లో తెల్సిపోయింది. బయటకి పోకుండా జూత్తన్నారు. ఆడు మాత్రం వదలకుండా చీకటిపడ్డాక ఈ చుట్టు పక్కల తిరుగుతా తంటాలు పడతన్నాడు. ఈ సంగతి ఊరంతా తెలుసు. ఒకసారి చిన్న గొడవ కూడా అయ్యింది.' అంటూ అసలు విషయాన్ని చెప్పాడు. తిరపతమ్మ తిట్లకే సగం చచ్చిపోయిన నాగులు వెంకటేసు మాట్లాడాక తలవాల్చుకున్నాడు.

'ఛ...ఛ' అనుకుంటూ సిగరెట్ ఒకటి తీసి వెలిగించాడు. ఒక దమ్ములాగి చెప్పడం మొదలుపెట్టాడు. 'నాకు తెలుసే పిన్నామా.. నాకు తెలుసు.. అందుకే ఇన్నాళ్ల తర్వాత కూడా దాన్ని ఎతుక్కుంటూ వచ్చా.. ఇందాక కోపంలో అనవసరంగా... ఛ..ఛ' అంటూ పశ్చాత్తాపంతో మాట్లాడాడు. సీతామాలక్ష్మి కళ్లు తుడుచుకుంది. అందరూ మౌనంగా వుండిపోయారు.

-నాలుగు రోజుల తర్వాత ఒక సాయంత్రం....

ఆ చుట్టుపక్కల ఆడవాళ్లంతా అంజమ్మగారి ఇంటి అరుగుమీదకి చేరారు. భర్తతో వెళ్లిపోతున్న సీతామాలక్ష్మిని పలకరించే ఉద్దేశ్యంతో అక్కడికి చేరారు వాళ్లు. 'ఏంజేత్తాడో ముదరట్టపు సచ్చినోడు. ఆ ఊళ్లో ఇల్లూవాకిలీ గూడా లేదంట. కసాయోడి ఎనకాల గొర్రె పోతన్నట్టు పోతంది మాలచ్మి' బాధగా అంది ఒక నడివయసామె. 'అది మాత్రం ఏంజేత్తదే ఎల్లక? మొగుడు లేకుండా ఎట్టా బతుకుద్దీ ఎల్లకాలం?' అని ఇంకో ముసలమ్మ అంది.

'ఏంటే ఎట్టా బతికేదీ? మొందట్నుంచి ఆడేదో దీన్ని బతికించినట్టు మాట్టాడతన్నారు. ఇన్నాలూ ఆడు లేకుండానే గవురంగా బతికిందా లేదా? అట్టాగే ఉప్పుడు గూడా ఆడు వున్నా గానీ లేనట్టే దైర్నంగా బతుకుద్ది. ఇన్ని కతలు జేసినోడిని ఆడిని ఎవురు నమ్ముతారు? దాని మీద నమ్మకం వుండబట్టే ఆళ్లు గూడా పంపిత్తన్నారు' అని గట్టిగా మాట్లాడింది ఇంకో ఆమె. ఇంట్లో నుంచి కళ్లు తుడుచుకుంటూ బయలు దేరిన సీతామాలక్ష్మిని చూసి వారు మాటలు ఆపేశారు.

సీతామాలక్ష్మి పక్కనే నరసమ్మ, ఖాసింబీ, తిరపతమ్మ నడుస్తున్నారు. 'అత్తా... నేనొత్తా.. నేనొత్తా' అంటూ సీతామాలక్ష్మి వెంటపడి ఏడుస్తున్న బుజ్జిని నరసమ్మ బలవంతంగా గుంజుకుపోయి కోడలికి అప్పగించి వచ్చింది. అన్నింటికంటే, బుజ్జిని విడిచి వెళుతున్నందుకు సీతామాలక్ష్మికి దుఃఖం పొంగుకొస్తోంది. అప్పటికే నాగులూ, శివయ్య, వెంకటేసు బయలుదేరి నడుస్తున్నారు. శివయ్య నెత్తిమీద బియ్యం మూట వుంది. వెంకటేసు ఒక చేతిలో కొత్తకాగూ, మరో చేత్తో కొత్త బక్కెట్ పట్టుకుని నడుస్తున్నాడు. సీతామాలక్ష్మి దారిలో ఎదురైన వారందరికీ వెళ్లొస్తానని చెప్పి కదులుతోంది. అంజమ్మగారి అరుగు దగ్గరకు వచ్చాక అక్కడున్న ఆడవాళ్లందరికీ చెప్పటానికి ఒక నిముషం ఆగింది. 'ఎల్లొత్తానండి' 'ఎల్లొత్తానవ్మా' అంటూ వారందరికీ చెప్పింది. 'ఇక్కడ ఆగుతున్నాం లే! నువ్వికా కదులు' అంటూ నరసమ్మ, ఖాసింబీ, తిరపతమ్మ ఆగిపోయారు. 'ఎల్లిరావమ్మా! సంతోసంగా ఎల్లిరా! అప్పుడప్పుడు వొత్తావుండండి' అంటూ వారందరూ చెమర్చిన కళ్లతో వీడ్కోలు చెప్పారు.

సీతామాలక్ష్మికి సంతోషంగా లేదు. అలా అని దుఃఖంగానూ లేదు. 'ఇంతకు మించి మరోదారి లేదు' అనే సంగతిని బాగా అర్థం చేసుకుంది. 'ఏ రకంగా జరగాలనుంటే ఆ రకంగా జరుగుద్ది' అనే నిశ్చయంతో వుంది. ముందు నడుస్తున్న మగాళ్లను అందుకోవడానికి వేగంగా అడుగులు వేస్తోంది సీతామాలక్ష్మి. ★

వచ్చేవారం కథ

ఉసురు

- దాసరి రామచంద్రరావు